క్లుప్తంగా

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్

ఎంపీడీవో కె.శివపార్వతి

ప్రత్తిపాడు: మండల పరిధిలోని పెదగొట్టిపాడు సచివాలయంలో ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.శివపార్వతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డులు లేని విద్యార్థులకు నూతన కార్డులను జారీ చేయుటకు, బయోమెట్రిక్ అప్‌డేట్‌తో పాటు పలు ఆధార్ సంబంధిత సేవలను స్పెషల్ క్యాంపులో అందిస్తున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల ప్రజలు, పిల్లల తల్లిదండ్రులు క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఆధార్ క్యాంపు గురించి ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు.

సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

ప్రత్తిపాడు: ఆర్‌జీఎస్‌ఏ 2025–26 వార్షిక ప్రణాళికలో భాగంగా పంచాయతీరాజ్ సంస్థల్లో సొంత ఆదాయ వనరులు, కెపాసిటీ బిల్డింగ్‌పై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 23, 24 తేదీల్లో గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.శివపార్వతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మాస్టర్ ట్రైనర్లు ఆయా అంశాలపై శిక్షణ ఇస్తారని, సభ్యుల హాజరును టీఎంటీ పోర్టల్, ప్రగతి యాప్‌లో నమోదు చేయనున్నట్లు చెప్పారు. సర్పంచ్‌లు, సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు తప్పక హాజరుకావాలని ఆమె పేర్కొన్నారు.

కళ్ళం ఉపాధ్యాయుడికి డాక్టరేట్



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయుడి లక్ష్య సాధనకు తమ కళాశాల ఎల్లప్పుడూ కృషి చేస్తుందని కళ్ళం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎస్‌ఎండీ జుబేర్‌బాషాకి తిరుచిరాపల్లిలోని భారతిదాసన్ యూనివర్సిటీ డాక్టరేట్ (పీహెచ్‌డీ) ప్రదానం చేసిందన్నారు. ఏ ఫ్రేమ్ వర్క్ ఫర్ డిమాండ్ బేస్డ్ వేరియేషన్ మేనేజ్‌మెంట్ ఇన్ రియూసబిలిటీ ఇంజనీరింగ్ ఆఫ్ డొమైన్ స్పెసిఫిక్ సాఫ్ట్‌వేర్ కాంపోనెంట్స్ అనే అంశంపై డాక్టర్ గోపీనాథ్ గణపతి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన జుబేర్‌బాషాను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, డాక్టర్ ఎండీ సిరాజుద్దీన్ తదితరులు అభినందించారు.

మల్లవరంలో వైద్య శిబిరం



గుంటూరు రూరల్: మండలంలోని మల్లవరం గ్రామంలో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, క్షయ వ్యాధి స్క్రీనింగ్, మానసిక వైద్య సేవలు, ఆయుష్ సేవలు తదితర విభాగాలలో మహిళలకు, గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విశ్వ, డాక్టర్ అరుణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటరత్నం, మల్లవరం ఏఎన్‌ఎం నర్మద, ఆశా వర్కర్ దుర్గ, మండలంలోని ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు.

విజ్ఞాన్ నిరులలో ఇంటర్నల్ హ్యాకథాన్ పోటీలు



గుంటూరు రూరల్: భవిష్యత్ సాంకేతికతల్లో భారతదేశాన్ని ముందంజలో నిలపాలనే లక్ష్యంతో, మినిస్ట్రీస్ ఆఫ్ ఎడ్యుకేషన్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్–2025 దేశ వ్యాప్తంగా నిర్వహించబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా, జేఎన్టీయూకే అనుబంధ సంస్థ పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఫర్ ఉమెన్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఇంటర్నల్ హ్యాకథాన్ పోటీలు జరిగాయి. వివిధ విభాగాలకు చెందిన 378 మంది విద్యార్థినులు 63 బృందాలుగా ఏర్పడి పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ హ్యాకథాన్‌లు విద్యార్థినులలో తార్కిక ఆలోచన, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఆర్‌డీ డీన్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణ విద్యార్థినుల ఉత్సాహాన్ని అభినందించారు. నెట్‌వర్క్ సెక్యూరిటీ, ఏఐ, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, బిగ్ డేటా వంటి విభాగాల్లో పోటీలను నిర్వహించారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన జట్లను జాతీయ స్థాయి ఎస్ఐహెచ్–2025 పోటీలకు ఎంపిక చేయనున్నారు. డాక్టర్ సత్య సందీప్ వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలువ కట్ట మార్గం.. బురదమయం

- నిధులు మంజూరయ్యాయంటూ ప్రకటనలు
- ఆచరణకు మాత్రం నోచుకోని వైనం

చేబ్రోలు: గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులు బురదమయంగా, అధ్వానంగా తయారయ్యాయి. అందుకు ఉదాహరణే చేబ్రోలు మండలం శ్రీరంగపురం గ్రామానికి వెళ్లే కొమ్మమూరు చానల్ కాలువ కట్ట రోడ్డు నిదర్శనం. మండల పరిధిలోని వడ్లమూడి గ్రామం నుంచి కొమ్మమూరు చానల్ వంతెన ఉంచి కాలువ కట్ట రహదారి గుండా ఐదు గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రధాన రోడ్డు మార్గం. రెండు మండలాలకు చెందిన గ్రామాలకు అనుసంధానమైన కొమ్మమూరు చానల్ కట్ట రహదారి అభివృద్ధికి నోచుకోకపోవటంతో రాకపోకలు సాగించే శ్రీరంగపురం, వేటపాలెం, తోట్లపాలెం, పెనుగుదురుపాడు, పలివేరు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఆ గ్రామాలకు ఈ రోడ్డే దగ్గర మార్గం. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి బురదమయంగా మారి రాకపోకలు సాగించటానికి వీలులేక అధ్వానంగా తయారైంది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు కూడా ఈ మార్గంలో ప్రయాణించటం ఇబ్బందికరంగా మారింది. ఈ రహదారికి మరమ్మతులు చేయటానికి నిధులు మంజూరైనట్లు అధికారులు, నాయకులు ప్రకటిస్తున్నప్పటికీ ఆచరణలో అమలు జరగకపోవటంతో ఐదు గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న కొమ్మమూరు చానల్ కాలువ కట్ట రహదారి

వైభవంగా దేవి శరన్నవరాత్రులు ప్రారంభం



గంగాపార్వతీ సమేత దండేశ్వరాలయంలో రజిత కవచాలంకృత పార్వతీదేవి



వేణుగోపాలస్వామి దేవాలయంలో మహాలక్ష్మిదేవి



పెదకాకాని రెడ్డివారి బావి వద్ద అభయాంజనేయస్వామి ఆలయంలో...



చేబ్రోలులోని గంగాపార్వతి సమేత నాగేశ్వరస్వామి దేవాలయంలో...

- పలు ఆలయాలకు శరన్నవరాత్రి శోభ
- అమ్మవార్లకు విశేష అలంకరణలు, పూజలు

ప్రత్తిపాడు: దసరా పురస్కరించుకుని ఆలయాల్లో దేవి శరన్నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం నుంచి తొమ్మిది రోజుల పాటు జగజ్జనని అఖండ హారతులు, అలంకారాల మధ్య సర్వశోభితయై భాసిల్లనుంది. పలు దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించడంతో గ్రామాల్లో దసరా శోభ కనిపిస్తోంది.

ప్రత్తిపాడులోని గంగాపార్వతి సమేత దండేశ్వర స్వామి ఆలయంలో తొలిరోజు రజిత కవచాలంకృత పార్వతీదేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు పరమేశ్వరశర్మ అమ్మవారిని అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేణుగోపాలస్వామి దేవాలయంలో మహాలక్ష్మి దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసుల శేషభట్టరాచార్యులు నేతృత్వంలో విశేష పూజలు చేశారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ బంధం కృష్ణమోహన్, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు

పొన్నూరు: దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి.



కొత్తరెడ్డిపాలెంలో మహిళల కోలాట ప్రదర్శన

పట్టణంలోని తెలగపాలెంలో వేంచేసి ఉన్న సీతా లక్ష్మణ హనుమత్ సమేత కోదండ రామాలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సహస్ర నామ కుంకుమార్చన, సాయంత్రం అష్టోత్తర శతనామ కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

గోరంట్ల వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో...

గుంటూరు రూరల్: దసరా పండుగ చాలా ముఖ్యమైనదని చెడు మీద మంచి సాధించే విజయంగా ఈ పండుగను విజయదశమి అని పిలుస్తామని ఆలయ చైర్మన్ కంచర్ల ఆంజనేయులు తెలిపారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గోరంట్లలోని వేంకటేశ్వరాలయం (పెద్దగుడి)లో సోమవారం ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యురాలు గోలి ధనలక్ష్మి మాట్లాడుతూ గోరంట్ల వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బతుకమ్మ సంబరాలు సోమవారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయని, మహిళలు బతుకమ్మ సంబరాలలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని అన్నారు. కార్యక్రమంలో నాగరాజకుమారి, ప్రమీల, సునీత, అరుణ, రత్న, శాంతి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలు మండలంలో...

చేబ్రోలు: చేబ్రోలు మండలంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం తొలి రోజు వివిధ గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చేబ్రోలులో గంగాపార్వతి సమేత నాగేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారు రజత కవచ (వెండి చీర) అలంకృతమై భక్తులకు దర్శనమిచ్చారు. భీమేశ్వరస్వామి దేవస్థానంలో బాలాత్రిపుర సుందరిగా ప్రత్యేక పూజలు అందుకున్నారు. మండల పరిధిలోని నారాకోడూరులోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బాలాత్రిపుర సుందరిగా, కొత్తరెడ్డిపాలెం ఆనంద ఆశ్రమం సమీపంలో స్థానిక భక్తులు కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొన్నూరు మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



గోరంట్లలో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు



సహస్ర లింగేశ్వరస్వామి ఆలయంలో...



సాక్షి భావనారాయణస్వామి ఆలయంలో...



చేబ్రోలు మండలం నారాకోడూరు వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో...

మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ ఆధ్వర్యంలో స్థానిక అమరావతి రోడ్డు హిందూ కాలేజీ ఆఫ్ ఫార్మసీ ఆవరణలో సోమవారం మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ముఖ్య అతిథిగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ పాల్గొని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య గత 42 సంవత్సరాలుగా సమాజంలో ఎన్నో రకాల సేవలు అందించిందన్నారు. నిరుద్యోగ సమస్య అధికంగా ఉన్న తరుణంలో ఎన్నో వ్యయ ప్రయాసలను అధిగమించి మెగా జాబ్ మేళా నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. నిరుద్యోగ యువత డిసెంబర్ 13వ తేదీన నిర్వహించే జాబ్ మేళాలో పాల్గొనాలని కోరారు. కోనూరు సతీష్ శర్మ మాట్లాడుతూ విజన్ ఆంధ్ర 2047 లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని, నిరుద్యోగులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో మెగా జాబ్ మేళాకు శ్రీకారం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

చుట్టామని తెలిపారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ మాట్లాడుతూ డిసెంబర్ 13 వరకు అన్ని వర్గాల నిరుద్యోగులు రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. హిందూ ఫార్మసి కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర నాని మాట్లాడారు. కార్యక్రమంలో అడ్వైజరీ కమిటీ చైర్మన్ సత్యవాడ దుర్గాప్రసాద్, ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ప్రధాన కార్యదర్శి మనోహరరావు, జాబ్ మేళా కమిటీ మెంబెర్ కొప్పర్తి సీతారమేష్ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

గుంటూరు రూరల్: దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని అంకిరెడ్డిపాలెం గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, ఆధ్యాత్మిక గ్రంథాలను గ్రామంలోని ప్రజలకు చదివి వినిపించారు. దశ అంటే పది అని, ర అంటే నశింపజేయడమనే అర్థం, ఐదు కర్మేంద్రియాలను, ఐదు జ్ఞానేంద్రియాలను యోగ మార్గంలో నశింపజేయడం దసరా పండుగ అర్థమని తెలిపారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు, టీవీ కృష్ణారావు, ఫణిధరం శివ, పట్టాబి శ్రీను, మౌనిక, షేక్ దిల్షా, ఏ అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఏఎన్‌యూ రెక్టార్‌గా ఆచార్య శివరామ్ ప్రసాద్

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ రెక్టార్ బాధ్యతలను సీనియర్ ఆచార్యులు ఆచార్య రామినేని శివరామ్ ప్రసాద్‌కు ఇస్తున్నట్లు సోమవారం వర్సిటీ తాత్కాలిక రిజిస్ట్రార్ జి.సింహాచలం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనకు నియామక ఉత్తర్వులను వీసీ ఆచార్య కె.గంగాధరరావు అందజేశారు. ఆచార్య రామినేని శివరామ్ ప్రసాద్ లాంటి విశిష్ట అనుభవం కలిగిన వ్యక్తి ఎంపిక పట్ల వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఆచార్య రామినేని బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వర్సిటీ తాత్కాలిక వీసీ ఆచార్య గంగాధరరావు, దూర విద్యాకేంద్ర సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు, నూటా అధ్యక్షుడు ఆచార్య బ్రహ్మాజీరావు, కార్యదర్శి ఆచార్య త్రిమూర్తిరావు, వర్సిటీ అంతర్గత కళాశాలల



ఆచార్యులు, ఆర్ట్స్ కళాశాల ఆచార్యులు సురేష్ కుమార్, ఓఎస్‌డీ రవికుమార్, వికాస నేతలు శ్రీనివాసరావు, ప్రభాకర్, వర్సిటీ సిబ్బంది పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

ప్రత్తిపాడులో ఫీవర్ సర్వే



ప్రత్తిపాడు: వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రత్తిపాడు కో లొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. ప్రత్తిపాడులో సోమవారం వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతో కలిసి గ్రామంలో ఫీవర్ సర్వే చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి జ్వర బాధితులు, డయేరియా బాధితులు ఉన్నారా..? వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శితో కలిసి ఆరోగ్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మంగళవారం నుంచి పది రోజుల పాటు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని సూచించారు. జ్వరం, విరేచనాలు వంటివి ఉంటే వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. సెక్రటరీ ఖాజా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశాలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సహకారం అందించాలి

వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్



బలసానిని మర్యాదపూర్వకంగా కలిసిన నియోజకవర్గం పరిశీలకుడు గులాం రసూల్

గుంటూరు రూరల్: మండలంలోని ఏటుకూరు బైపాస్ రోడ్డులోని వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యాలయంలో ప్రత్తిపాడు, తెనాలి నియోజకవర్గాల పరిశీలకులుగా నియమితులైన షేక్ గులాం రసూల్ సోమవారం నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గులాం రసూల్‌ను బలసాని ఘనంగా సన్మానించారు. గులాం రసూల్ బలసానికి పుష్పగుచ్ఛాన్ని అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బలసాని మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తమ వంతు సహకారాలను అందించి, పార్టీకి అన్ని విధాలుగా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

నియోజకవర్గం నాయకుల సమావేశం

మండలంలోని ఏటుకూరు బైపాస్‌రోడ్డులోని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో సమావేశాన్ని ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆయన దృష్టికి వచ్చిన పలు సమస్యలపై స్పందించి, వారికి అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్

యువత వినూత్నంగా ఆలోచించాలి

ఐడియా ల్యాబ్స్ సీఈవో పంకజ్ దీవాన్

ప్రత్తిపాడు: యువ విద్యార్థులు వినూత్నంగా ఆలోచించి, సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే నూతన ఆవిష్కరణలను రూపొందించాలని ఐడియా ల్యాబ్స్ సీఈవో పంకజ్ దీవాన్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఎజెంటిక్ ఏఐ కంప్యూటింగ్ హ్యాకథాన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన ఐడియా ల్యాబ్స్ సీఈవో పంకజ్ దీవాన్ జ్యోతి ప్రజ్వలన చేసి హ్యాకథాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పంకజ్ దీవాన్ మాట్లాడుతూ హ్యాకథాన్‌లు విద్యార్థుల భవితను ఉజ్వలంగా తీర్చిదిద్దుకునేందుకు ఉపకరిస్తాయన్నారు. ఏఐ రంగంలో చోటు చేసుకుంటున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు ఒడిసి పట్టుకోవాలని సూచించారు. మలినేని సంస్థల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ విద్యార్థుల్లో పరిశోధనాత్మక ఆలోచనలు, భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ హ్యాకథాన్‌ను నిర్వహించామన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ హ్యాకథాన్‌లను సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తులో నూతన ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుందన్నారు. డీఎస్ విభాగాధిపతి హరికృష్ణ మాట్లాడుతూ మలినేని యాజమాన్యం మహిళా ఇంజనీర్లను టెక్నాలజీ రంగంలో ముందంజలో నిలబెట్టే దిశగా నిరంతరం సాధన చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జెట్టి అప్పారావు, ఆయా విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐడియా ల్యాబ్స్ సీఈవో పంకజ్ దీవాన్, పక్కన కళాశాల చైర్మన్

అంగన్‌వాడీల్లో పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన

ప్రత్తిపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను అందించడం జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.భారతి అన్నారు. రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలలో భాగంగా సోమవారం ప్రత్తిపాడులోని ఉప్పరపాలెం అంగన్‌వాడీ సెంటరు, గొట్టిపాడు వి–నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య, పోషకాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కథలు, బొమ్మల పుస్తకాల ద్వారా అంగన్‌వాడీ లో చిన్నారులకు పాఠ్యాంశాలు ఎలా బోధిస్తారన్న విషయాన్ని ఆయా సెక్టార్‌ల సూపర్‌వైజర్లు వివరించారు. సూపర్‌వైజర్ భారతి మాట్లాడుతూ చిన్నారులను కచ్చితంగా అంగన్‌వాడీ సెంటర్లకు పంపాలన్నా రు. ఆహ్లాదకర వాతావరణంలో ఆటపాటలతో కూడిన విద్యను కార్యకర్తలు అందిస్తారని చెప్పారు. చిన్నారులకు ప్రతి రోజూ ఆహారంలో ధాన్యాలు, పప్పులు, కూరగాయలు, పండ్లు, గుడ్లు, పాలు, నెయ్యి ఉండేలా చూసుకోవాలని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా అవసరమన్నారు. గొట్టిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ పి.మాధవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.కుసుమ, జి.మహాలక్ష్మి పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ భారతి

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పొన్నూరు: సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై అధికారులతో సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో వచ్చే డెంగీ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు రోజు కాచి చలార్చిన నీటిని తాగాలన్నారు. పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని, ఏమైనా అనారోగ్య సమస్యలు ఉంటే వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జియావుల్ హక్, వైద్యులు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్లోని ప్రాంగణంలో ఎక్కువగా పెరిగిన గడ్డిని తొలగించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య సిబ్బందిని ఆదేశించారు. ప్రతి రోజు ఉదయం వ్యాయామం కోసం వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ రమేష్‌బాబు

గుంటూరు చానల్ భూ సేకరణకు నిధులు మంజూరు చేయాలి

కాకుమాను: గుంటూరు చానల్ భూ సేకరణకు ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు అన్నారు. పెదనందిపాడు తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సోమవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు చానల్ పొడిగింపు కార్యాచరణ అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజలు ప్రధానంగా గుంటూరు చానల్ పొడిగింపును కోరుకుంటున్నారని తెలిపారు. ఇందులో వరికపూడిశెల ప్రాజెక్టు కీలకమని అలాంటి వాటిని అభివృద్ధి చేస్తే సుమారు 50 గ్రామాలకు తాగు, సాగునీరు సకాలంలో అందుతుందని అన్నారు. చానల్ పొడిగింపుపై గతంలో వినతిపత్రాలు అందజేసినా ఆచరణకు నోచుకోలేదని తెలిపారు. ప్రముఖ పారిశ్రామికవేత్త దాసరి శేషగిరిరావు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకట శివరావు, బాపట్ల జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు బండి శంకరయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు, నరిశెట్టి ఆచార్యులు, మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, ముద్దన రాఘవయ్య, దొప్పలపూడి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మణరావు